విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 04, అక్టోబరు 2025

పార్టీ పదవీ బాధ్యతను మరింత పెంచింది

విశాలాంధ్ర-అవకు: వైసీపీ పదవి బాధ్యతను మరింత పెంచింది అని వైసీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి అన్నారు. పట్టణ శివారులోని చల్లా ఫామ్ హౌస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి తనకు రాష్ట్రస్థాయిలో పార్టీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా ఎంపిక చేయడంతో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. పార్టీలో సీని యర్లతో పాటు తనకు స్థానం కల్పించడంతో భారంగా కాకుండా బాధ్యతగా పని చేస్తానని అన్నారు. పార్టీ పదవిని అలంకారంగా భావించకుండా పార్టీని ప్రజలలోకి తీసుకపోతానని అన్నారు. ప్రజలకు పార్టీకి అనుసంధానంగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయడమే నా ప్రథమ కర్తవ్యం అని అన్నారు.

పందుల స్వైర విహారంతో అనారోగ్యం..

విశాలాంధ్ర - వెలుగోడు: పట్టణములోని సీపీఐ(ఎం) నగర్ నందు నివాసముండే ఇళ్ల మధ్య పందులు స్వైర విహారం చేస్తుండడం వల్ల ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. పందుల యజమానులు పందులను స్వేచ్ఛగా వదిలేయడం వల్ల అవి నివాసము ఉండే ఇళ్ల మధ్య తిరుగుతూ మురికి కాలువలను, బురద గుంటలను చిందర వందర చేస్తూ దుర్గంధ భరిత వాసన వెదజల్లుతున్నందు వల్ల పిల్లలు, పెద్దలు, మహిళలు వాంతులు, విరేచనాలు జ్వరాలతో బాధపడుతున్నారు. ఈ సమస్యపై అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకొని పందులను ఊరి బయట వదిలేయాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణోద్యమం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైస్ షర్మిలా రెడ్డి, నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు జెంగిటి లక్ష్మినరసింహ యాదవ్ ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బరగోడ్ల హుస్సేన్ బాష ఆధ్వర్యంలో దొంగ ఓట్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ ఉద్యమం నిర్వహించారు. ఆళ్లగడ్డలోని నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న గాంధీ విగ్రహానికి పూల మాల వేసి అనంతరం కేక్ కట్ చేసి గాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడి, ఓట్ల దొంగ, గద్దె దిగు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ ఉపాధ్యక్షులు మౌలాన అబ్దుల్ మజీద్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనారిటీ సెక్రటరీ శంసుల్ హాక్, నంద్యాల పార్లమెంట్ మహిళా జిల్లా అధ్యక్షురాలు దాసరి సుమిత్ర, నంద్యాల పార్లమెంట్ జిల్లా అధికార ప్రతినిధి వై.సంజీవ కుమార్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ వెస్లీ పాల్గొన్నారు.

గాజులపల్లెలో డెంగ్యూ కేసు నమోదు..

విశాలాంధ్ర -మహానంది: మండలంలోని గాజులపల్లె గ్రామంలో డెంగ్యూ కేసు నమోదు అయింది. కొలిమి పేటకు చెందిన హుస్సేన్ భాష కుమారుడు తన్వీర్ (5)కు గత నెల సోమవారం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడ డెంగ్యూ పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ బారినపడినట్టు వైద్యులు నిర్ధారించారు. శుక్రవారం నంద్యాల మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర రెడ్డి కొలిమి పేటకు చేరుకుని వివరాలు సేకరించి, దోమలు కుట్టకుండా చూసుకోవాలని అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర నాయక్ పారిశుధ్య పనులు, క్లోరినేషన్ చేయించారు. మండల అధికారులు పారిశుధ్యం మీద చర్యలు తీసుకోకపోవడంతో వ్యాధులు ప్రబలుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి గ్రామంలో పారిశుధ్య పనులు చేయాలని కోరుతున్నారు.

కాళికామాత సేవలో శిల్పి దురుగడ్డ బాల సుబ్రహ్మణ్యం ఆచారి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: స్థానిక విశ్వరూప నగర్ శ్రీశ్రీశ్రీ కాళికా మాత దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి వసంతోత్సవం మహా నివేదన కార్యక్రమం నిర్వహించారు. అన్న ప్రసాద వితరణ ఉభయ దాతలు శిల్పి బాలసుబ్రమణ్యం ఆచారి (బాలు) దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళా కమిటీ సభ్యులు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

స్మశాన వాటికకు విద్యుత్ సౌకర్యం

విశాలాంధ్ర - శిరివెళ్ల: మండల పరిధిలోని కామినేని పల్లె గ్రామంలోని స్మశాన వాటికకు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ మేర్వ చిన్న నరసింహారెడ్డి తెలిపారు. నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ కేబుల్ లాగి స్ట్రీట్ లైట్‌లు సైతం అమర్చి విద్యుత్ సరఫరా అందించినట్లు తెలిపారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి మౌలిక వసతులలో భాగంగా స్మశాన వాటికను సైతం ముళ్ల పోదలు పిచ్చి మొక్కలు తొలగించి, ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ మేర్వ చిన్న నరసింహ రెడ్డి తెలిపారు.

మళ్లీ కుంగిన అవుకు జలాశయం రివిట్‌మెంట్

- ఆందోళనలో రైతాంగం
- కొరవడిన అధికారులు పర్యవేక్షణ

విశాలాంధ్ర-అవుకు: అవుకు జలాశయం అంతర్భాగమైన తిమ్మరాజు కట్ట రివిట్మెంట్ మళ్లీ కుంగడంతో ఆయకట్టు రైతాంగం ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది సెప్టెంబర్ నెలలో అవుకు జలాశయం అంతర్భాగ మైన తిమ్మరాజు చెరువు కట్ట లోపల భాగము ఒక మీటర్ పొడవు, రెండు మీటర్ల వెడల్పుతో రివిట్‌మెంట్ కుంగడంతో నల్ల మట్టిని కప్పి తాత్కాలిక మరమ్మత్తులు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. అనంతరం జలాశయంలో నీటి సామర్థ్యం తగ్గిన అధికారులు శాశ్వత పరిష్కారంగా అడుగులు వేయలేదు. జీఎన్ఎస్ఎస్, ఎస్సార్బీసీ కాల్వ ద్వారా మీరు అవుకు జలాశయంలోకి వచ్చి చేరడంతో నీటి సామర్థ్యం దాదాపుగా 4 టీఎంసీలకు చేరుకుంది. గతంలో రివిట్మెంట్ పొంగిన ప్రాంతంలోనే ఆరు మీటర్ల పొడవు నాలుగు మీటర్ల వెడల్పుతో రెవిట్మెంట్ మళ్లీ కుంగింది. కుంగిన ప్రాంతంలో నుంచి మట్టి కట్టల ద్వారా నీరు లిఖిత రూపంలో బయటకు వస్తోంది. అవుకు జలాశయంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల లోతట్టు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ మెంట్ పొంగిన ప్రాంతాన్ని తెలుగుదేశం అవుకు మండల అధ్యక్షుడు ఉగ్రసేనారెడ్డి, ఎస్సార్ బీసీ ఎస్సీ రెడ్డి శేఖర్ రెడ్డి, ఈఈ శుభకుమార్, సీఐ మంజునాథ్ రెడ్డి, టీడీపీ నాయకులు సుగాలి వెంకటరమణ నాయక్, అరుణ్ కుమార్ నాయకులు పరిశీలించారు.

ఆశా కార్యకర్తల డిమాండ్‌లు వెంటనే నెరవేర్చాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: ఆశా కార్యకర్తల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ఏఐటీడీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తల సమస్యలపై నంద్యాల సీపీఐ కార్యాలయమంలో ఏఐటీయుసి పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు అధ్యక్షతన జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో గత 19 ఏళ్ల కిందట ఎలాంటి విద్యార్హత, వయస్సుతో సంబంధం లేకుండా ఆశాలుగా నియమించబడి గ్రామ, పట్టణాలలో గర్భవతులకు, బాలింతలకు, నవజాత శిశువులకు వైద్య సేవలందిస్తున్న ఆశా కార్యకర్తలకు ఎలాంటి వేతనాలు పెంపు, సెలవులు, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం లేదని, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి చేరవేయడంలో విశేష కృషి చేస్తూ పని భారంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆశా వర్కర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి వేదవతి మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు, రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచడం, 180 రోజుల మెటర్నిటీ సెలవులు తదితర జీవోలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకట రమణకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆశా వర్కర్ల ట్రెజరర్ లక్ష్మీదేవి, ఆశ వర్కర్ల రాష్ట్ర సమితి సభ్యురాలు మహాలక్ష్మి, ఏఐటీడీయూసీ బనగానపల్లె సెక్రటరీ కుళాయిస్వామి, కొలిమిగుండ్ల మండల అధ్యక్షుడు మహేష్ పాల్గొన్నారు.

కళకళలాడుతున్న వరి

బోరు బావులు కింద పెరిగిన సాగు విస్తీర్ణం

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : సాగు ఉంటుందో లేదో నన్న నిరాశలో ఉన్న దశ లో రైతన్నలకు రెండు నెలల నుండి కురుస్తున్న భారీ వర్షాలు ఊరట నచ్చాయి. భారీ వర్షాల రాకతో వాగులు వంకలు పొంగి ప్రవహించడంతో పాటు గ్రామాల పరిధిలోని చెరువులు నీటికలను సంతరించుకున్నాయి. దీంతో అడుగంటిన భూగర్భ జలాలు వర్షాల రాకతో భారీగా పెరగడంతో రైతన్నలు విస్తారంగా వరి సాగును చేపట్టారు. బోరు బావులు చెరువుల ఆయకట్టు కింద ఆరువరాల కిందట వరిసాగు చేశారు. కురుస్తున్న వర్షాలతో పాటు సమృద్ధిగా భూగర్భ జలాలు ఉండడంతో సాగుచేసిన వరి పంట వచ్చదనంతో కళకళలాడుతున్నది. మండలంలోని అబ్దుల్లాపురం, కోరుమానుపల్లి, తొళ్లమడుగు, చింతలాయిపల్లి, ఎస్.చెన్నంపల్లి, కలవటాల, తిమ్మనాయునిపేట, బి.తాడపత్రి, హనుమంతు గుండం, ఎర్రగుడి తదితర గ్రామాలలో వరి సాగుపై అన్నదాతలు ఆసక్తి కనపరిచారు. గతేడాది 350 ఎకరాలలోపే వరిని సాగు చేయగా ప్రస్తుత సంవత్సరం ఖరీఫ్ చివర్లో మండల వ్యాప్తంగా 1200 ఎకరాలకుపైగా రైతన్నలు వరిని సాగు చేశారు. మొక్కజొన్న సాగు సైతం దాదాపు ఇదే విస్తీర్ణంలో సాగయింది.

నంద్యాలలో అంబరాన్నంటిన దసరా సంబరాలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: పట్టణంలో దసరా సంబరాలు అంబరాన్నంటాయి. పట్టణంలోని ఇండోర్ స్టేడియం, మున్సిపల్ టౌన్ హాల్, విక్టోరియా రీడింగ్ రూమ్ నందు నంద్యాల యువకులచే నిర్వహించిన సాంస్కృతిక దసరా వేషాల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి నాయకులు ఎన్ఎండి ఫయాజ్ హాజరై దసరా శుభాకాంక్షలు తెలిపారు. అంతరించిపోతున్న దసరా వేషాలను గుర్తించి యువత ఆధ్వర్యంలో ఈ దసరా వేషాల కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా చేసుకొనే పండగ దసరా అని, మీరు చేసే ప్రతి పనిలో మీకు విజయం చేకూరాలని ఆ దుర్గమ్మ ఆశీస్సు లతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరు కుంటున్నానని ఫయాజ్ తెలిపారు. పట్టణంలోని బైటిపేట, ఉప్పరిపేట తదితర 6 ప్రాంతాల నుండి దసరా వేషాల్లో పాల్గొన్నారు. వీరికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఖండే శ్యాంసుందర్ లాల్, టిడిపి నాయకులు, పిల్లి వెంకటేశ్వర్లు, బుగ్గ రాముడు మల్లికార్జున్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేకు ప్రజలు సహకరించాలి

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా: మండలంలోని 35 బొల్లవరం గ్రామంలో జరగనున్న రీ సర్వేకు ప్రజలు సహకరించాలని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ రైతులను కోరారు. శుక్రవారం గ్రామంలో రీసర్వేకు సంబంధించి గ్రామ సచివాలయంలో గ్రామ సభ నిర్వహించి రైతులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ నాయక్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రి సర్వే ప్రాజెక్టు మూడవ దశలో భాగంగా మండలంలోని 35 బొల్లవరం గ్రామంలో రీసర్వే ప్రారంభించడం అయినదని ఆయన తెలిపారు. భూముల్లో ఏదైనా సమస్యలు ఉంటే వాటిని రీ సర్వే ద్వారా వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ నాగన్న, మండల సర్వేయర్ అతీఫ్, సహాయ గణాంక అధికారి హనుమంతు, గ్రామ సర్వేయర్లు వెంకటకృష్ణ, తరుణ్, బాలుడు, ఇందిరా, టిడిపి నాయకులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, వీరారెడ్డి, బాబిరెడ్డి, గ్రామ రెవెన్యూ సహాయకులు, గ్రామ ప్రజలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ డైరెక్టర్‌ను సన్మానించిన వీఓఏ యూనియన్

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల టీడీపీ అధ్యక్షులు మాజీ ఎంపీపీ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్‌గా ఎంపికైనందున మండల విఓఎ యూనియన్ నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానం చేశారు. బోయలకుంట్ల గ్రామంలోని ఆయన నివాసంలో యూనియన్ నాయకులు పూల మాల వేసి పట్టు వస్త్రాలు కప్పి సన్మానం చేశారు. వీఓఏ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎన్వి నరసింహులు మాట్లాడుతూ టిడిపిలో సుదీర్ఘ కాలంగా ఉంటూ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు విశేష కృషి చేసిన శ్రీకాంత్ రెడ్డిని గుర్తించి రాష్ట్రస్థాయి డైరెక్టర్ పదవి ఇవ్వడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వీవో యూనియన్ ఆళ్లగడ్డ బ్లాక్ అధ్యక్షులు రత్నం, శిరివెళ్ళ మండల అధ్యక్షులు నారాయణరెడ్డి, నాయకులు రమణ, ప్రసాద్, మధు, నరేష్, బలరాముడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ జనాభా అధికంగా ఉన్న గ్రామాల అభివృద్ధి లక్ష్యం

విశాలాంధ్ర - చాగలమర్రి : ఎస్సీల జనాభా అధికంగా ఉన్న గ్రామాల సమగ్ర అభివృద్దే ప్రధానమంత్రి ఆదర్స గ్రామీణ యోజన లక్ష్యమని ఎంపీడీఓ తాహీర్‌హుసేన్ అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద ఎస్సీ జనాభా అధికంగా ఉన్న బ్రాహ్మణపల్లె గ్రామం ఎంపికైందన్నారు. పిఎంఏజివై క్రింద ఎంపికైన గ్రామాలకు కేంద్ర ప్రభుత్వం రూ 20లక్షల ప్రత్యేక నిధులను మంజూరు చేస్తుందన్నారు. మంజూరైన ఈ నిధులతో గ్రామంలో చేపట్టవలసిన అభివృద్ధి పనులపై గ్రామసభలో చర్చించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పిఆర్ ఏఈ కొండారెడ్డి,పంచాయతీ కార్యదర్సి అన్సర్ బాష, ఎంసీఓ రాజ్‌కుమార్, టిడిపి నాయకులు రామకృష్ణారెడ్డి, లూకా, బాబయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగ పరిరక్షణకు కలసి ముందుకు నడుద్దాం

విశాలాంధ్ర - పాములపాడు: భారత రాజ్యాంగంలోని లౌకిక, సామ్యవాద పదాలను తొలగించడానికి ఆర్ఎస్ఎస్‌తో కలిసి బిజెపి కుట్ర పన్నుతున్నదని భారత రాజ్యాంగం పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగిద్దామని జాతీయ మహానాడు నాయకులు నల్లమల్ల అబ్రహం ఆధ్వర్యంలో ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం మైనారిటీ తదితర ప్రజాసంఘాల నాయకులైన మాల మహానాడు రాష్ట్ర నాయకులు కడియం సాంబశివుడు,బీసీ సంఘం జాతీయ నాయకులు బత్తుల సంజీవరాయుడు, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి.సోమన్న, కేవిపిఎస్ జిల్లా నాయకులు ఎం.రాజు, ప్రజా సంఘాలు కలిసి అంబేద్కర్ మరియు జ్యోతిరావు పూలే విగ్రహాల దగ్గర శుక్రవారం నిరసన తెలుపుతూ కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం మౌలిక లక్షణాలైనా లౌకికవాదం సామ్యవాదం పదాలను తొలగించేందుకు కేంద్రంలో ఉన్న బిజెపి ఆర్ఎస్ఎస్ తో కలిసి పూను కుందని ఆ కుట్రలను ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం మైనారిటీ ఆధ్వర్యంలో తిప్పి కొడతామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈనెల 9వ తేదీన విజయవాడలో నిరసన కార్యక్రమం ధర్నాను నిర్వహించడం జరుగుతుందని, పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. కలబండి బాలస్వామి, దేవ భక్తుడు, ఎస్.బాలయ్య, శెట్టి ఏసన్న, రజక సంఘం నాయకులు రామకృష్ణ, చౌడయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దసరా ఉత్సవాలు.. ఆకట్టుకున్న నృత్యాలు

విశాలాంధ్ర - మహానంది : మహానంది క్షేత్రంలో 11 రోజులు పాటు జరిగిన దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం పూర్ణాహుతితో ముగిసాయి. ముందుగా ఆలయంలో వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ, శాంతారాం బట్, హనుమంతు శర్మ,ఋత్విక్కులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక దసరా పూజలు నిర్వహించారు. యాగశాల మంటపంలో ఆలయ ఈఓ శ్రీనివాస రెడ్డి చేత యాగాలు, హెూమాలు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి జరిపారు. సాయంకాలం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మహానంది సమీపంలోని ఈశ్వర్‌నగర్ కాలనీలో జమ్మి చెట్టు వద్దకు ఉత్సవమూర్తులను మేళతాళాలతో తీసుకొచ్చి గ్రామోత్సవం జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపర్నెంట్స శశిధర్ రెడ్డి, నీలకంటేశ్వర రాజు, సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగ మల్లయ్య, భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకొన్న దసరా వేషధారణలు : మహానందిలో జరిగిన విజయదశమి వేడుకల్లో భాగంగా గ్రామానికి చెందిన యువకులు దసరా వేషాలు వేశారు. ఆలయం ముందు భాగంలో శక్తి, భద్రకాళి, మహిషాసురమర్దిని అలంకరణలతో నృత్యాలు నిర్వహించారు. ఈ నృత్యాలను చూసేందుకు చుట్టు పక్కల గ్రామాలనుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొత్త పథకానికి శ్రీకారం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం సంక్షేమం దిశగా మరో అడుగు వేసిందని, ఇప్పటికే పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం డ్రైవర్ల సంక్షేమం కోసం ఆటో డ్రైవర్ సేవలో పథకానికి శ్రీకారం చుట్టనున్నట్లు ఎంపీ, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి ఓ ప్రకటనలో తెలిపారు. సొంత ఆటో రిక్షా, మోటార్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ఆర్థికంగా అండగా నిలబడేందుకు ఈ పథకం రూపొందించిందని, ఈ పథకం కింద అర్హులైన డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేల చొప్పున ఇవ్వనుందని, ఈ పథకాన్ని శనివారం సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారని ఎంపీ వివరించారు.

చింతలపల్లి గ్రామంలో స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ

విశాలాంధ్ర - మిడుతూరు: స్మార్ట్ రైస్ కార్డులు కుటుంబానికి భరోసా అని పీరు సాహెబ్ పేట సహకార సొసైటీ చైర్మన్ రెడ్డి వారి వెంకటేశ్వర రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చింతలపల్లి గ్రామంలో స్మార్ట్ రైస్ కార్డులను సర్పంచ్ రవణమ్మ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సహకార సొసైటీ చైర్మన్ మాట్లాడుతూ చౌక బియ్యం పక్కదారి పట్టకుండా నివారించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. రేషన్ లబ్ధిదారుల ఇబ్బందులను తొలగిస్తూ స్మార్ట్ రైస్ కార్డులను అందుబాటులోకి తెచ్చిందన్నారు. సాంకేతిక సమస్యలకు అడ్డుకట్ట, రాజకీయ ప్రచారానికి తెరదించేలా స్మార్ట్ కార్డులను రూపొందించారని, రేషన్ లబ్ధిదారులు నెలలో ఎప్పుడైనా నిత్యవసర సరుకులు తీసుకోవచ్చని చెప్పారు. .ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి వినయ్ చంద్ర, వీఆర్వో రహీం సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మన వార్డు, మన బాధ్యత పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: మన వార్డు, మన బాధ్యత కార్యక్రమాన్ని ఎస్డిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్డిపిఐ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్లాఖాన్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చేరుతున్నాయా లేదా అన్నది తెలుసుకోవడం కోసం ఎస్డిపిఐ సర్వే చేపట్టిందని, ప్రజలకు ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఎదురైతే వాటిని నేరుగా పార్టీ వార్డు ఇంచార్జి ద్వారా పరిష్కార దిశగా తీసుకెళ్లబడతాయన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గని మాట్లాడుతూ ప్రతి కుటుంబం అభివృద్ధి చెందడం ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్డిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజాస్ హుస్సేన్, రాష్ట్ర కార్యదర్శి తాహిర్ హుస్సేన్, రాష్ట్ర కమిటీ సభ్యులు,జిల్లా అసెంబ్లీ నాయకులు, పంచాయతీ నాయకులు,వార్డు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడే వారికి గుర్తింపు

విశాలాంధ్ర - చాగలమర్రి: వైసీపీ కోసం అహర్నిషలు కష్టపడే వారికి తప్పక గుర్తింపు ఉంటుందని వైసీపీ మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి, ఉపసర్పంచ్ సోహెల్‌లు తెలిపారు. పట్టణానికి చెందిన వైసీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి బాబులాల్‌ను రాష్ట్ర కార్యనిర్వహక మండలి సభ్యులుగా పార్టీ అధిష్ఠానం నియమించింది. దీంతో చాగలమర్రి పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, బాబులాల్ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు చక్రం బీడీ షబ్బీర్, గణేష్‌రెడ్డి, వెంకటరమణ, గేట్లమాబు, ఖాధర్ బాష, ఆర్ఎస్‌రమణ, రమణారెడ్డి, ఫ్రూట్స్‌షేక్షా, బ్రహ్మయ్య, శ్రీనివాసులు, నారా ఓబులేసు, షఫి, బాబు, ప్రచార కార్యదర్శి పెయింటర్ రఫి, పెయింటర్ షరీఫ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

సక్రమంగా సరుకులు పంపిణీ

విశాలాంధ్ర - రుద్రవరం: ప్రతి కార్డుదారునికి ప్రభుత్వం అందించే సరుకులను సక్రమంగా అందించాలని తహసీల్దారు ఆల్ఫ్రెడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని నాగులవరం గ్రామంలో గ్రామస్తులకు అందించే రేషన్ దుకాణాన్ని ఆయన పరిశీలించారు. కాటాను, కార్డుదారుల వివరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేషన్ దుకాణాలలో ప్రభుత్వం అందించే సరుకులను డీలర్లు సక్రమంగా ప్రతి కార్డుదారునికి అందించాలన్నారు. పంపిణీలో అవకతవకలు చేస్తే అలాంటి డీలర్‌పై చర్యలు తీసుకుంటాన్నారు.

కలుగోట్లలో వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య ఘర్షణ

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: మండలం కలుగొట్లలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య శుక్రవారం ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో వైసీపీకి చెందిన ఆరుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా, టీడీపీకి చెందిన అర్జున్ రెడ్డి మరో ఇద్దరు గాయపడ్డారు. గత కొంతకాలంగా గ్రామంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కి ముఖ్య అనుచరుడైన గద్దం అర్జున్ రెడ్డికి వైసీపీకి చెందిన రాజా రెడ్డి మధ్య వర్గ విభేదాలు ఉన్నాయి. శుక్రవారం ఉదయం మరో మారు ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. వైసీపీ వర్గీయులపై టీడీపీకి చెందిన గద్దం అర్జున్ రెడ్డి వర్గీయులు కర్రలు తీసుకొని దాడి చేశారని గాయపడిన వైసీపీ వర్గీయులు ఆరోపిస్తున్నారు. ఈ ఘర్షణలో వైసీపీకి చెందిన పెద్ద గుర్రప్ప, చిన్న గుర్రప్ప, నడిపి గుర్రప్ప, శ్రీనివాసులు, మగ్బుల్, బ్రహ్మానందరెడ్డి, సుధాకర్ రెడ్డిలు గాయపడ్డారు. కలుగోట్ల గ్రామంలో ఘర్షణ విషయం తెలుసుకున్న ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి తన సిబ్బందితో హుటాహుటిన గ్రామానికిచేరుకున్నారు. ఇరు వర్గాలను చెదర గొట్టి గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. టీడీపీ వర్గీయులు, వైసీపీ కార్యకర్తలపై దాడి చేశారన్న విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని గాయపడ్డ వైసీపీ కార్యకర్తలను పంమర్శించారు. రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అండదండలతో టిడిపి కార్యకర్తలు రెచ్చి పోతున్నారని వైసీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆరోపించారు. వైసీపీ కార్యకర్తల పై దాడికి పాల్పడ్డ మంత్రి అనుచరుడు గద్దం అర్జున్ రెడ్డితో పాటు అతని అనుచరులపై కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి హింసను ప్రోత్సహిస్తున్నారని, వైసీపీ కార్యకర్తలే లక్ష్యంగా దాడులకు ఉసిగొల్పుతున్నారని కాటసాని ఆరోపించారు. ఇలానే దాడులు పునరావృతమైతే చూస్తూ ఊరుకునేది లేదని మాజీ ఎమ్మెల్యే కాటసాని హెచ్చరించారు. ఘర్షణలో గాయపడి టీడీపీనాయకుడు అర్జున్ రెడ్డిని బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సకు తరలించారు.

గ్రామాధిపత్యం కోసమే ఘర్షణలు : స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కలుగోట్ల గ్రామంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఆధిపత్య పోరు తారా స్థాయికి చేరింది. గత పంచాయతీ ఎన్నికల్లో అధికార పక్షానికి చెందిన వైసీపీ అభ్యర్థిపై టిడిపి బలపరిచిన అభ్యర్థి విజయం సాధించాడు. ఈ విజయంలో టీడీపీకి చెందిన అర్జున్ రెడ్డి అనుచరుడు సర్పంచ్ అభ్యర్థిగా విజయం సాధించాడు. అనంతరం 2024లో టిడిపి అధికారంలోకి రావడం తమ నాయకుడు బీసీ జనార్దన్ రెడ్డి మంత్రి కావడంతో టిడిపి వర్గీయులకు ఉత్సాహం రెట్టింపు అయింది. అయితే ఎప్పటి నుండో గ్రామంలో ఆధిపత్యం కొనసాగించిన రాజారెడ్డి కుటుంబం తిరిగి గ్రామంపై పట్టు కోసం తీవ్ర ప్రయత్నాలు మొదలు పెట్టింది. దీంతో చిన్నచిన్న విషయాలకే వైసీపీ, టిడిపి వర్గీయుల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ కోవలోనే శుక్రవారం ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ హనుమంతు నాయక్ తెలిపారు.

అటవీ సంరక్షణపై అవగాహన

విశాలాంధ్ర - రుద్రవరం: అటవీ, వన్యప్రాణుల సంరక్షణపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని రుద్రవరం రేంజ్ అధికారి ముర్తుజావలి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ డిప్యూటీ డైరెక్టర్ ప్రాజెక్ట్ టైగర్ అనురాగ్ మీనా ఆదేశాల మేరకు మండలంలోని నరసాపురం గ్రామం లో అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా వన్యప్రాణులను వేటాడిన ఎడల వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారము కఠినమైన శిక్ష విధించబడును. వన్య ప్రాణుల నివాసాలను సంరక్షించి జీవవైవిధ్యమును పరిరక్షించాలని, వన్యప్రాణులు గ్రామాలలోనికి వస్తే వాటికి హాని చేయవద్దని వెంటనే ఈ విషయమును అటవీ అధికారులకు తెలియజేయాలని, పంట పొలాల చుట్టూ కరెంటు తీగలు, ఉచ్చులు పెట్టవద్దని, వాటికి ఆవాసాలైన అడవులను నరకవద్దని, గ్రామానికి సమీపంలో ఉన్న మీరు చెట్లను నరకవద్దని, అడివిలో ఎక్కడైనా మంటలు మండితే వాటిని ఆర్పి వేయడానికి అటవీ అధికారులైన తమకు సహకరించాలని కోరారు. నరసాపురం సర్కిల్ వద్ద మానవహారం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ డిఎఫ్ శ్రీనివాసుల రెడ్డి, ఫారెస్ట్ సెక్షన్ అధికారి మత్తర్ భాష, సెక్షన్ ఆఫీసర్లు రాణమ్మ, రామకృష్ణ, బీట్ ఆఫీసర్లు జేమ్స్ పాల్, హుస్సేన్ బాష పాల్గొన్నారు. అనంతరం నరసాపురం చెక్ పోస్టును సిబ్బందితో తనిఖీ చేశారు.

అమ్మవారి ఆలయం అభివృద్ధికి విరాళం

విశాలాంధ్ర - బనగానపల్లె: మండల పరిధి లోని నందవరం గ్రామ ంలో వేసిన శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి దేవ స్థానం నందు తిరుపతి జిల్లా తిరుచానూరు చెందిన కీ.శే. ఎగ్గోని శివరామ్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి కొరకు రూ.25,116చందాను డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ పీవీ కుమార్ రెడ్డి సమక్షంలో ఆలయ అర్చక వేదపండితులకు అందచేశారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 04, అక్టోబరు 2025

అధిక వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

ఈ నెల ఆరో తేదీన జరిగే ధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కర్నూలు : జిల్లాలో అధిక వర్షాల వలన నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సిఆర్ భవన్‌లో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎన్.లెనిన్ బాబు ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం జిల్లా ఉపాధ్యక్షులు డి.శ్రీనివాసరావు సిపిఐ కర్నూల్ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి సహాయ కార్యదర్శి సి.మహేష్ దొడ్డిపాడు బాష కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా కె.రామాంజనేయులు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ముందుగా కురిసినవర్షాల వలన విస్తారంగా ఉల్లి, మిరప, టమోటా, పత్తి వేరుశనగ, ఆముదము, కొర్ర, సజ్జ,కంది, జొన్న లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేయడం జరిగిందన్నారు. సాధారణ వర్షపాతం కన్నా 37.9శాతం కురిసిన అధిక వర్షాల వలన చేతికొచ్చిన పంటలు నీట మునిగిపోయి కుళ్లిపోయాయన్నారు. లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి చేతికి అందిన పంట రాకపోవడంతో రైతులు అప్పుల ఊబిలోకి కూరుకుపోయారన్నారు. ఆదోని లాంటి పట్టణ ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరి రోడ్లు పాడై పోయాయని, జిల్లాలోని పత్తికొండ ఆదోని ఎమ్మిగనూరు, కోడుమూరు మంత్రాలయం, కర్నూలు రూరల్ ప్రాంతాల్లో ఉన్న పంటలు నాశనం అయిపోయాయని తెలిపారు. ఇంత జరుగుతున్న జిల్లాలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం రైతుల కష్టాలను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన జిల్లాలోని అన్ని మండలాల్లో ధర్నా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

నష్టపోయిన పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి : బి.గిడ్డయ్య

విశాలాంధ్ర-పత్తికొండ: అధిక వర్షాల వల్ల నష్టపోయిన పంట పొలాలను అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక చదువుల రామయ్య భవనంలో ఈ నెల 6న మండల కేంద్రాల్లో జరిగే ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కురిసిన అరకొర వర్షాలకు రైతులు వేరుశనగ, ఉల్లి, పత్తి, టమోటా, మిరప, ఆముదం, సజ్జ, కంది తదితర పంటలను సాగు చేశారని, గత నెల రోజులుగా ఎడతెరపి లేకుండా కురిసిన అధిక వర్షాలకు అన్ని రకాల పంటలు పూర్తిగా నష్టపోవడం జరిగిందన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వా లని డిమాండ్ చేశారు. సీపీఐ, ఏపీ రైతు రైతు సంఘం ఆధ్వర్యంలో అధిక వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవా లని కోరుతూ ఈ నెల 6వ తేదీన మండల కేంద్రాలలో జరిగే ధర్నా కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి.రాజా సాహెబ్, మండల కార్యదర్శి యు.కారుమంచి, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి సురేంద్ర కుమార్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు కారన్న, పెద్ద ఈరన్న, నాయకులు వెంకటరామిరెడ్డి, జోహరాపురం కాశీ, రాజప్ప, తదితరులు పాల్గొన్నారు.

హులికన్వి గ్రామంలో దసరా సందర్భంగా ఆటల పోటీలు

విశాలాంధ్ర - పెద్దకడబూరు: మండల పరిధిలోని హులికన్వి గ్రామంలో గురువారం దసరా పండుగ సందర్భంగా సర్పంచ్ చిన్న మహాదేవ ఆధ్వర్యంలో పురుషులకు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. పురుషులకు కళ్లకు గంతలు కట్టి పిల్లని గ్రోవి శబ్దాన్ని అనుసరించి ఉంగరాన్ని వెతకడం పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.1500, రెండో బహుమతిగా వెయ్యి రూపాయలు, మూడో బహుమతిగా రూ.500 అందజేశారు. మహిళలకు పీపీ కూయడంలో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.2 వేలు, రెండో బహుమతిగా రూ.1500, మూడో బహుమతిగా వెయ్యి రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద మహాదేవ, నర్సిరెడ్డి, మూకిరెడ్డి, అయ్యప్ప, నల్లారెడ్డి, తిమ్మప్ప అధిక సంఖ్యలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఆస్పిరేషనల్ బ్లాక్‌ల అభివృద్ధికి కృషి చేయండి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: జిల్లాలలో గుర్తించబడిన ఆస్పిరేషనల్ బ్లాక్‌ల అభివృద్ధి కృషి చేయాలని నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఢిల్లీ నీతి ఆయోగ్ కార్యాలయం నుండి నీతి ఆయోగ్ సీఈవో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఈవో మాట్లాడుతూ ఎంపవర్ కమిటీ నిర్ణయం మేరకు చిప్పగిరి ఆస్పిరేషనల్ బ్లాక్‌కు కేటాయించిన రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టాల్సిందిగా జిల్లా కలెక్టరును ఆదేశించారు. నిర్దేశించిన కాల వ్యవధిలో చిప్పగిరి మండలంలో అభివృద్ధి పనులు పూర్తి కావా లని జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి అధికారులను ఆదేశించారు. నీతి ఆయోగ్ ద్వారా చిప్పగిరి ఆస్పిరేషనల్ బ్లాక్‌కు రూ.1.50 లక్షలు కేటాయించడం జరిగిందన్నారు. అంగన్వాడీల అభివృద్ధికి రూ.35 లక్షలు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా అభివృద్ధి పనులకు రూ.95 లక్షలు, పాఠశాలల అభివృద్ధికి రూ.20 లక్షలతో అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. ఈ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సిపిఓ భారతి, జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి, డిపిఓ భాస్కర్, హౌసింగ్ పీడీ చిరంజీవి, డిఆర్డిఏ పిడి రమణారెడ్డి, పశుసంవర్ధక శాఖ జెడి శ్రీనివాసులు, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ మనోహర్, డీఈవో శామ్యూల్ పాల్, డిప్యూటీ డిఎంహెచ్ఓ భాస్కర్, ఐసిడిఎస్ పిడి విజయ, ఎల్డిఎం రామచంద్రరావు, డిడి గ్రౌండ్ వాటర్ సన్నన్న, జిల్లా అస్పిరేషనల్ బ్లాక్స్ మండల కోఆర్డినేటర్‌లు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు తెగిపోయిన రోడ్డు

విశాలాంధ్ర - పెద్దకడబూరు : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండల శివారాలో ఉన్న వంకకు భారీగా వరదరావడంతో పెద్దబావి నుండి కులాలకు వెళ్లే రోడ్డు తెగిపోవడంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం కోత గురైన రోడ్డును రైతులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ముక్కరన్న, మల్లికార్జున, నరసింహులు, దావీదు, గజ్జన్న, నాగేంద్ర, వీరనాగప్పలు మాట్లాడుతూ రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కోతకు గురైన రోడ్డును తక్షణమే వర్మతులు చేయించాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ రోడ్డు వెంబడి వందలాది మంది రైతులు పొలాలకు, వివిధ గ్రామాలకు వెళ్తుంటారని వారు గుర్తు చేశారు. ముఖ్యంగా రైతులు మందులు, ఎరువులను పొలాలకు తీసుకెళ్లేందుకు, పంటను ఇంటికి తీసుకొచ్చుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేయించి రైతులకు న్యాయం చేయాలని రైతులు కోరారు.

అంగరంగ వైభవంగా మాళ మల్లేశ్వర స్వామి కళ్యాణోత్సవం

విశాలాంధ్ర - హొళగుంద: నేరనికి దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి కళ్యాణోత్సవం, మాంగాల్య ధారణ, జైత్రయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. 800 అడుగుల ఎత్తులో ఉన్న గిరిపైకి భక్తులు ఊరేగింపుగా భారీగా తరలివెళ్లి మాల మల్లేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేసి పురోహితులచే వేదమంత్రోచ్ఛణల మధ్య రాత్రి ఒంటిగంటకు అశేష జన వాని మధ్య కల్యాణోత్సవం జరిపారు. ఉత్సవమూర్తులను గిరి పైనుండి ఉపయోగిస్తూ జైత్రయాత్రగ బయల్దేరారు. రాష్ట్రంలో ఎంతో ప్రసిద్ధి చెందిన బన్నీ ఉత్సవం తిలకించడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తో పాటు ఇతర రాష్ట్రాలు నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి బల్లి ఉత్సవాన్ని తిలకించారు. త్రేతా యుగం కాలం నుండి కొనసాగుతున్న బన్నీ ఉత్సవంలో మాల మల్లేశ్వర స్వామి కళ్యాణం ఎంతో ప్రసిద్ధి చెందింది. మూడు గ్రామాల పెద్దలు మాలమ్మ, మల్లేశ్వరుడి వైపుగా బంధువులుగా మారి కంకణ ధారణ పూజలు చేసిన బన్నీ రోజున స్వాముల వారికి వైభవంగా కళ్యాణోత్సవం, మాంగాల ధారణాన్ని నిర్వహిస్తారు. జైత్రయాత్ర ఊరేగింపులు వేలాదిమంది స్వామివారి వెంట తరలి వెళ్తారు. మొక్కుబడిగా భక్తులు పసుపు బండారాన్ని చెల్లి మొక్కుబడి తీర్చుకుంటారు. స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది. ఆలయాన్ని నిర్వాహకులు, రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. బన్నీ ఉత్సవంలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా జిల్లా ఎస్పీ విక్రాంత పార్టీ 100 సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు, భారీ విద్యుత్ దీపాలను అమర్చి 800 మంది పోలీసు బందో బస్తు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, ఆదోని డివిజన్ సబ్ కలెక్టర్ మౌర్య భారద్వాజ భక్తులకు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో భక్తులకు వసతులు కల్పించారు. బన్నీ ఉత్సవంలో రెండు లక్షల మంది భక్తులు పాల్గొ న్నట్లు మూ డు గ్రామా ల పెద్దలు శుక్రవారం తెలిపారు. అందరి సహకారంతో బన్నీ పండుగ విజయవంతం అయిందని జిల్లా ఉన్నతాధికారులకు, మండల అధికారులకు, ప్రజా ప్రతి నిధులకు, జర్నలి స్టులకు మూడు గ్రామాల పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. బన్నీ ఉత్సవం తిలకించడానికి భారీ సంఖ్యలో భక్తులు ద్విచక్ర వాహనాలు, కార్లు, జీపులు, లారీలలో బయలు దేరారు. దారులన్నీ దేవరగట్టు వైపే అన్నట్లు దేవరగట్టుకు పరిసర ప్రాంతాల ప్రజలు, మహిళలు వర్షాన్ని లెక్క చేయకుండా కాలి నడకన నడుచుకుంటూ తరలి వెళ్లారు. వృద్ధులు, చిన్నారులు తాము సైతం అంటూ దేవరగట్టుకు పరుగులు తీసి ఇవన్నీ ఉత్సవాన్ని చూశారు. బన్నీ ఉత్సవంలో తహసీల్దార్ నిజాముద్దీన్, ఎండీఓ విజయ లలిత, సీఐ రవి శంకర్ రెడ్డి, ఎస్సై దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యవాణి ఇదే :

దేవరగట్టు మాల మల్లేశ్వర బన్నీ ఉత్సవంలో శుక్రవారం బసవన్న గుడిపై ప్రధాన అర్చకుడు గిరి మల్లయ్య స్వామి గోపారాక్ బహు జాగ్రత్త అంటూ నినాదాలు ఇచ్చాడు. తర్వాత ఆయన పసుపు బండారాన్నిభక్తులపై చెల్లి ప్రపంచ దేశాల్లో అల్లకల్లోలం జరుగుతుందని వరదలు, భూకంపాలు, భీభత్సం, రాజకీయ సంక్షోబం జరుగుతాయని, పార్వతీదేవి ఏటికి నిలిచింది అంటే వర్షాలు సమృద్ధిగా కురిసి, ఉత్తర దిక్కుకు వెళుతుందని అర్థం. క్వింటాల్ పత్తి ధర రూ.7200 పలుకుతుందని, క్వింటాల్ జొన్నలు రూ.3400లతో అమ్ముడు అవుతాయని అన్నారు. వాణిజ్య వ్యాపార ధరలు తగ్గి మళ్లీ పెరుగుతాయని భవిష్య వానిలో అన్నారు. దేవరగట్టు బన్నీ భవిష్యవాణి రైతులు పంటలు, వ్యాపార వాణిజ్యాలపై వేరేది వేసుకుంటారు అలాగే ఎంతో విశ్వాసంగా భవిష్యవాణిని నమ్ముతారు.

కాశ్మీర్ ఎగ్జిబిషన్ ప్రారంభం

విశాలాంధ్ర - కర్నూలు: నగరంలోని ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన కాశ్మీర్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్‌తో పాటు కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఇల్లూరు లక్ష్మయ్య, మైనార్టీ నాయకులు నౌషాద్, కార్పొరేటర్ పరమేష్, ఎగ్జిబిషన్ నిర్వాహకులు కస్తూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాశ్మీర్ ఎగ్జిబిషన్‌ను రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ఎంపీ బస్తిపాటి నాగరాజుతో కలిసి పరిశీలించారు. ఎగ్జిబిషన్ ప్రత్యేకతలను నిర్వాహకులు వారికి వివరించారు. అనంతరం రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ కర్నూలు నగరంలో అందరిని ఆకట్టుకునేలా కాశ్మీర్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించే ప్రజలు కాశ్మీర్‌లో ఉన్న అందాలను ఆస్వాదించవచ్చని తెలియజేశారు. ఇక్కడ సెల్ఫీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. ఇది కర్నూలు కొత్తదనాన్ని తీసుకువస్తుందన్నారు. రాష్ట్ర మంత్రి టీజీ భరత్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నారని, ముఖ్యంగా కర్నూలు పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక విప్లవం జరుగుతుందని చెప్పారు. అనంతరం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ కర్నూలు నగరంలో ప్రజలను ఆకట్టుకునేలా కాశ్మీర్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను ప్రతి ఒక్కరు సందర్శించి, ఆహ్లాదాన్ని పొందాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి.. మరొకరికి గాయాలు

విశాలాంధ్ర - ఆస్పరి: మండల పరిధిలోని నగరూరు బస్టాండ్ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటనలో ఆదోని లక్ష్మీ విలాస్ బ్యాంకులో మేనేజర్‌గా పని చేస్తున్న శశిధర్ రెడ్డి (35) అక్కడికక్కడే మృతిచెందగా, ఆయన బంధువు విష్ణువర్ధన్ రెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, దసరా, విజయదశమి పండుగల సందర్భంగా తన సొంత ఊరు తాడిపత్రికి శశిధర్ రెడ్డి వెళ్లారు, పెద్దల పండుగలో పూజా కార్యక్రమాలు ముగించుకొని గురువారం మోటార్ సైకిల్‌పై తాడిపత్రి నుండి ఆదోనికి బయలుదేరాడు. ఆయనతో పాటు బంధువు, బావమరిది అయిన విష్ణువర్ధన్ రెడ్డి ఉన్నారు. రాత్రి సమయంలో నగరూరు బస్టాండ్ సమీపంలో ఒక ఐసర్ వాహనం మోటార్ సైకిల్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. తలకు తీవ్ర గాయాలైన శశిధర్ రెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా, విష్ణువర్ధన్ రెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి, మృతదేహాన్ని ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య గౌతమి, నాలుగు నెలల చిన్న కుమారుడు ఉన్నారు. ఒక్కసారిగా భర్తను కోల్పోవడంతో భార్య గౌతమి కన్నీరు మున్నీరై విలపించింది. చిన్నారికి తండ్రి కళ్లెదుటే లేకపోవడం బంధువులందరిని కదిలించింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన

విశాలాంధ్ర - చిప్పగిరి: సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అన్నదాతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి శ్రీరామ్ ప్రవీణ్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని నగర డోన, నేమకల్లు గ్రామ రైతులకు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి శ్రీరామ్ ప్రవీణ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో రైతులు ఉపయోగించే ట్రాక్టర్, వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గించడం జరిగిందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు ఉపయోగించే వస్తువులు, వ్యవసాయ పనిముట్లపై ఐదు శాతం జీఎస్టి ఉందని, దీనిపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ఎగ్జి క్యూటివ్ ఆఫీసర్ మురళీ కృష్ణ, మండల వ్యవసాయ విస్తరిణాధికారిని రమాదేవి, వీఏఏ సాయి కృష్ణ, ఎంపీఈఓ మనోహర్ వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రో బంకులో చేరిన వర్షపు నీళ్లు

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు రూరల్ : అధిక వర్షాలకు చేతికొచ్చిన పంటలు నీటిపాలైన అన్నదాతలు ఊహించని నష్టం, కష్టాలు చవిచూశారు. తాజాగా ఆ జాబితాలో పెట్రో బంకుల యజమానులు కూడా చేరారు. అధిక వర్షాలు, సమీప వంకలు, వాగులు ఉప్పొంగి భూగర్భంలో ఉండే ట్యాంకుల్లో నీళ్లు చేరడంతో రూ.లక్షల విలువైన పెట్రోల్, డీజిల్ నాణ్యత దెబ్బతిని యజమానులు ఆర్థికంగా తీవ్ర నష్టం చవిచూసి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఎమ్మిగనూరు పట్టణంలోని మంత్రాలయం - ఆదోని రహదారిలో ఉన్న ఉషా కిరణ్ సర్వీస్ స్టేషన్ పెట్రోల్ బంకులో అధిక వర్షాలకు భూగర్భంలో ఏర్పాటు చేసిన ట్యాంకుల్లో నీళ్లు చేరి పెట్రోలు, డీజిల్ నాణ్యత దెబ్బతిన్నట్లు యాజమాన్యం గుర్తించింది. ఇంధన సంస్థ టెక్నికల్ అధికారులు దృష్టికి తీసుకువెళ్లి వినియోగదారులు ఇబ్బంది లేకుండా తాత్కాలికంగా అమ్మకాలు ఆపేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో ట్యాంకులను శుభ్రం చేసి ఆ తరువాత విక్రయాలు చేపట్టారు. వేలాది లీటర్ల పెట్రోల్ నాణ్యత దెబ్బతిని రూ.లక్షలు నష్టపోయామని ఆ బంకు యజమాని విలేకరులకు వివరించారు. బంకు పక్కనే ఉన్న వంకను స్వార్థపరులు పూడ్చేయడంతో గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు వెళ్లే దారిలేక కాలనీలు ముంచెత్తింది. ఆ ప్రాంతం చెరువుగా మారింది. ఫలితంగా పెట్రో బంకు ట్యాంకుల్లో వర్షపు నీరు చేరాయని వాపోయారు. ఇంధన సంస్థలు ఇథనాల తో కూడిన పెట్రోల్ సరఫరా చేస్తున్నాయి. ఇథనాల్ మిళితమైన పెట్రోల్ నిల్వల్లో నీటిచుక్క కలిసినా క్రమంగా ఇథనాల్ పెట్రోలు నుంచి విడిపోయి, నీరుగా మారుతుందని ఇంధన నిపుణులు పేర్కొంటున్నారు. ఇథనాల్ మిళితమైన పెట్రోల్‌లో వర్షపు నీరు కలవడం వల్ల నాణ్యత దెబ్బతిని నష్టపోయామని యజమాని ఆవేదన చెందారు.

గెలుపొందిన జట్లకు నగదు అందజేత

విశాలాంధ్ర - నందవరం: దసరా పండుగ సందర్భంగా మేజర్ గ్రామం నందవరంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గెలుపొందిన జట్లకు టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ మార్కెట్ చైర్మన్ మాధవ దేశాయ్ నగదును అందించారు. గురువారం మల్లికార్జున స్వామి దేవాలయం ఆవరణలో ఏర్పాటు చేసారు. విజేతలకు మాధవ రావు దేశాయ్ నగదును అందించారు.టిడిపి నాయకులు తిమ్మరాజు, రాజోలి మోహన్, దండు నాగరాజు, చెంచు బంగారి, వడ్డే మురళి, చుక్క మునిస్వామి, పాల్గొన్నారు.

టీబీపీ చైర్మన్‌కు పితృవియోగం..

విశాలాంధ్ర - హొళగుంద: ఎల్లెల్సీ తుంగభద్ర ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ మిక్కిలినేని వెంకట శివ ప్రసాద్ తండ్రి మిక్కిలినేని రవీంద్ర బాబు (75) తీవ్ర అనారోగ్యంతో మృతి చెందారు. హెబ్బూరు కొట్టాలలో మిక్కిలి నేనీ రవీంద్రబాబు రైతుగా, టిడిపి నాయకుడిగా పార్టీకి ఎనలేని సేవ చేశారు. రవీంద్రబాబు మరణ వార్త వినగానే జిల్లా టిడిపి అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎంపీ బస్తి పాటి నాగరాజు, ఆలూరు నియోజకవర్గం మాజీ టిడిపి ఇంచార్జీ బి.వీరభద్ర గౌడ, రాష్ట్ర టిడిపి ఆర్గనైజింగ్ సెక్రెటరీ వైకుంఠం శివప్రసాద్ వేరువేరుగా మృతుడి భౌతిక గాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ మృతుడు టిడిపికి ఎంతో సేవ చేశారని ఆయన మృతితో పార్టీకి తీరని లోటు కలిగిందని స్పష్టం చేశారు. మృతుడి కుమారులు డీసీ చైర్మన్ మిక్కిలినేని వెంకట శివ ప్రసాద్‌కు, మిక్కిలినేని శ్రీనివాసరావుకు ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కూటమి, వైసీపీ నాయకులు మృతుడికి నివాళ్లర్పించారు.

టీడీపీ దళిత నాయకుడు మృతి..

విశాలాంధ్ర - హొళగుంద: స్థానిక ఇంద్ర నగర్‌లో శుక్రవారం టిడిపి దళిత సీనియర్ నాయకుడు హెచ్.సిద్ధప్ప మృతి చెందారు. మృతుడికి రాష్ట్ర టిడిపి ఆర్గనైజింగ్ సెక్రెటరీ వైకుంఠం శివప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. శివప్రసాద్ మాట్లాడుతూ మృతుడు సిద్ధప్ప పార్టీకి ఎనలేని సేవ చేశాడని ఎన్నికల్లో టిడిపి అభ్యర్థుల విజయానికి ఎంతో శ్రమించాడని కొనియాడారు. మృతుడి కుటుంబానికి ఎల్లవేళల అండంగా ఉంటామని సిద్ధప్ప మరణం ఎంతో దుఃఖంగా అన్నారు. రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి చిన్ని ఆట శేషగిరి, మండల టిడిపి కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య, టిడిపి నాయకులు ఈ గోవింద గౌడ్, ఎర్రి స్వామి, దుర్గప్ప, విష్ణువర్ధన్ రెడ్డి, గిరి, వలి, మల్లి, హనుమంతు, కూటమి నాయకులు, జర్నలిస్టులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

వైభవంగా చెన్నకేశవ స్వామి రథోత్సవం

విశాలాంధ్ర- ఎమ్మిగనూరు రూరల్: మండలంలోని కందనాతి గ్రామంలో దసరా మరుసటి రోజు చెన్నకేశవ స్వామి గుడి దగ్గర నుంచి ఊరి పొలమేరలో ఉన్న జమ్మి చెట్టు వరకు ఈ రథోత్సవం నిర్వహించారు. ఈ రథోత్సవాన్ని నాలుగు ఊర్లలో ఉన్న కందనాతి, మసీదుపురం, వెంకటగిరి, మాస్మన్ దొడ్డిలో కుల మతాలకు అతీతంగా భక్తులు ఆయన మీద భారమేసి తొమ్మిది రోజుల నుంచి చెప్పులు లేకుండా, మంచంపై పడుకోకుండా వారి భాగస్వామి దగ్గర వేరుగ చాలా నిష్టగా ఉంటూ ఈ రతాన్ని భుజస్కందాలపై మోశారు. చెన్నకేశవ స్వామి దివ్యాంగుడు అయినందున తన చెల్లెలు మారెమ్మని ఏడాదికోసారి దసరా పండుగ సందర్భంగా మాట్లాడడానికి, చూడడానికి వెళ్లే సందర్భంలో ఈ రథోత్సవాన్ని నిర్వహించారని చరిత్ర చెబుతుందన్నారు గ్రామస్తులు. పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ రథోత్సవంలో పాల్గొనడం జరిగింది.

గొర్రెల కాపరి ఎల్ల రాముని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర - కర్నూలు: జాతీయ రహదారిపై చిన్న టేకూరు గ్రామం సమీపాన కొట్టం కాలేజీ వద్ద కారు ప్రమాదంలో 35 గొర్రెలు చనిపోవడంతో పాటు గొర్రెల కాపరి ఎల్లా రాముడు మృతి చెందాడని ఆ కుటుంబాన్ని ఆదుకోవాలనిసంఘటనపై నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం గొర్రెల కాపరి స్వగ్రామమైన బస్తిపాడులో బాధిత కుటుంబ సభ్యులను ఆంధ్రప్రదేశ్ గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.రామాంజనేయులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథ్, సీపీఐ కర్నూలు నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, నగర సహాయ కార్యదర్శులు సి.మహేష్, డి.శ్రీనివాసరావు, ఏఐటీయూసీ నాయకులు దొడ్డిపాడు బాషలతో కలిసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భాధితుని కుటుంబ పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.రామాంజనేయులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథ్‌లు మాట్లాడుతూ ప్రమాదంలో గొర్రెల కాపరి ఎల్ల రాముడు చిన్న వయసులోనే ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు. సెంటు భూమి లేని ఎల్లా రాముడు జీవనాధారం కోసం గొర్రెలు మేపు గొర్రెల మేపుకొని జీవించడమే ప్రధానమైన వృత్తి అని, రోడ్డు ప్రమాదంలో అతని మృతితో వృద్ధురాలు అయిన తల్లితో పాటు చిన్న వయసులో ఉన్న అతని భార్య అనితతో పాటు నలుగురు కుమార్తెలు కూడా చాలా చిన్న వయసు వారేనని, కుటుంబ యజమాని మృతి వల్ల ఆ కుటుంబం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కుటుంబానికి తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృష్టితో రూ.15 లక్షల నష్టపరిహారం చెల్లించడంతోపాటు వారి జీవనాధారం కోసం గొర్రెల మేపుకునేందుకు నష్టపోయిన గొర్రెలు తిరిగి కొనుగోలు చేసుకునేందుకు 90శాతం సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలన్నారు. ఆ కుటుంబానికి కనీసం ఒక హెక్టార్ ప్రభుత్వ భూమిని కేటాయించాలని, వృద్ధు రాలైన తల్లికి వృద్ధాప్య పెన్షన్, భార్య అనితకు వితంతు పెన్షన్ తక్షణమే మంజూరు చేయాలని కోరారు. పిల్లలను ఎక్కువ మందిని కనాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో అతి చిన్న వయసులో మృతి చెందగా, అతని భార్యపై ఆధారపడిన నలుగురు కుమార్తెలను ప్రభుత్వమే రెసిడెన్షియల్ పాఠశాలల్లో డిగ్రీ వరకు ఉచితంగా చదివించేందుకు తగిన చర్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

శ్రేష్ఠ పథకం కింద చదువుతున్న విద్యార్థులను లోకల్ అభ్యర్థులుగా గుర్తించాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో శ్రేష్ఠ పథకం ద్వారా విద్యనభ్యసిస్తున్న విద్యార్థులను లోకల్‌గా గుర్తించాలని గురువారం పెద్ద కడబూరులో డీఈఓ శామ్యూల్ పాల్‌కు తల్లిదండ్రులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 2022లో కేంద్ర ప్రభుత్వం కేంద్ర న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్దేశిత వెనుకబడిన ఎస్సీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు శ్రేష్ఠ పథకం ద్వారా ఎంపికై వివిధ రాష్ట్రాల్లో చదువుతున్నారని తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 20తో వరుసగా నాలుగేళ్ల కాలంలో ఏ ఒక్క సంవత్సరం బయట రాష్ట్రంలో చదివినా నాన్ లోకల్‌గా పరిగణించబడతున్నారని, దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 20 నుంచి శ్రేష్ఠ విద్యార్థులకు మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నోటిఫికేషన్ జారీ మొదలుకొని ఎంట్రన్స్ పాఠశాలల్లో ప్రవేశాల ప్రక్రియ వరకు రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో జరుగుతున్నాయని, కానీ జీవో నెంబర్ 20 వల్ల శ్రేష్ఠ పథకం ద్వారా ఎంపికై వివిధ రాష్ట్రాల్లో చదువుతున్న విద్యార్థులను నాన్ లోకల్‌గా పరిగణించబడతున్నారని తెలిపారు.

రూ.10 వేల నగదు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-ఆస్పరి: మానవత్వం మరింత విలువైనదని నిరూపిస్తూ బండమీది వెంకటేశ్వర్లు సేవా సమితి, సీపీఐ మరోసారి తమ సేవా దృక్పథాన్ని చాటుకున్నాయి. మండలంలోని కైరుప్పల గ్రామానికి చెందిన ఏఐవైఎఫ్ మండల సహాయ కార్యదర్శి సురేష్ అన్న బలరాముడు గత పది రోజుల కితం గుండెపోటుతో మృతి చెందగా, ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయాన్ని తెలుసుకున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య గురువారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ముందుగా బలరాముడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండమీది వెంకటేశ్వర్లు సేవా సమితి తరఫున రూ.5 వేలు, సీపీఐ గ్రామశాఖ పార్టీ తరఫున మరో రూ.5 వేల అందించి మొత్తం రూ.10 వేల నగదును ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా గిడ్డయ్య మాట్లాడుతూ బలరాముడు కుటుంబానికి సీపీఐ ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందన్నారు. ఏ సమస్య వచ్చినా మేము భుజం ఇచ్చేలా ఉంటాం. మీరు ధైర్యంగా ఉండాలని ప్రోత్సహించారు. బాధిత కుటుంబ సభ్యులు ఈ సాయాన్ని స్వీకరించి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి, సహాయ కార్యదర్శి రమేష్, ఉపసర్పంచ్ వెంకటేష్, శాఖ కార్యదర్శి వీరేష్, పాఠశాల చైర్మన్ కాశీం, సీనియర్ నాయకులు బిజీ శ్రీనివాసులు, బిజీ విరేష్, బీకే ఉరుకుంద, రంగేష్, ఈరన్న, రంగన్న, హనుమంతు, రెవన్ పాల్గొన్నారు.

జీఎస్టీ పన్నుల తగ్గింపుతో రైతులకు ప్రయోజనం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : జీఎస్టీ పన్నుల తగ్గింపులో భాగంగా ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ పరికరాల ధరలు తగ్గడం వల్ల రైతులకు ప్రయోజనం కలుగుతుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు జీఎస్టీ పన్నుల తగ్గింపుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాక్టర్లు, వ్యవసాయ ఉపకరణాలపై జీఎస్టీ పన్నుల తగ్గింపుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అన్ని వర్గాలకు ప్రయోజనం కల్గించే విధంగా జీఎస్టీ పన్నుల తగ్గింపు జరిగిందన్నారు. అందులో భాగంగా ప్రజలకు జీఎస్టీ పన్నుల తగ్గింపుపై అవగాహన కల్పిస్తున్నారు. నిత్యావసర సరుకులతో పాటు వ్యవసాయ పరికరాలు, కార్లు, బైక్, ట్రాక్టర్‌ల మీద జీఎస్టీ పన్నులు తగ్గాయన్నారు. దుకాణదారులు పాత రేట్లకు అమ్మితే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. నిత్యావసర సరుకులకు సంబంధించి జీఎస్టీ పన్ను తగ్గించడంతో ప్రతి నెల కుటుంబానికి వెయ్యి రూపాయలు ఆదా అవుతుందన్నారు. షాపింగ్‌కి వెళ్ళిన సమయంలో వస్తువులు పాత రేట్లకు అమ్ముతున్నారా, కొత్త రేట్లకు అమ్ముతున్నారా అనే విషయాన్ని పరిశీలించుకోవాలని కలెక్టర్ ప్రజలకు సూచించారు.. హెల్త్ ఇన్సూరెన్స్ మీద కూడా జీఎస్టీ పన్ను తగ్గించారని కాబట్టి ప్రజలందరూ హెల్త్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతులు వారి పొలాలలో మొత్తం ఒకటే పంట వేయకుండా వేరువేరు పంటలు వెయ్యాలని కలెక్టర్ రైతులకు సూచించారు. ఈ సందర్భంగా రైతులు పంట మార్పిడి చేసుకోవాలని, ఒకటే పంట వేయకుండా రెండు, మూడు రకాల పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా పురుగుమందులు ఎక్కువగా వాడకుండా సహజ వ్యవసాయం చేయాలని కలెక్టర్ రైతులకు సూచించారు.. లైవ్ స్టాక్ మిషన్ కింద లోన్లు తీసుకొని పాడి పశువులను పెంచుకొని ఆదాయం మరింత పెంచుకోవాలని కలెక్టర్ రైతులకు సూచించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రోజు వారీ ఉపయోగించే చాలా వస్తువులపై జీఎస్టీ పన్నులు తగ్గించాయని తెలిపారు. ఈ సంస్కరణల వల్ల ప్రజలకు చాలా ఆదా అవుతుందని ఎమ్మెల్యే తెలిపారు.

జీఎస్టీ తగ్గింపు రైతులకు వరం

విశాలాంధ్ర - ఆదోని రూరల్: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ పరికరాలపై తగ్గించిన జీఎస్టీతో రైతులకు వరంగా నిలిచిందని వ్యవసాయ సహాయ సంచాలకులు బాలవర్ధిరాజు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు గడిచిన వారం రోజుల నుండి వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రజలకు జీఎస్టీ తగ్గింపు సంస్కరణలో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి బివిజి.సుధాకర్ నేతృత్వంలో మదిరి గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకులు బాలవర్ధి రాజు మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలు వ్యవసాయ రంగానికి ఎంతో ఊరటం ఇచ్చాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగరాజు స్వామి, వ్యవసాయ విస్తరణ అధికారులు సతీష్,సుధాకర్ గ్రామ వ్యవసాయ సహాయకులు ఎజ్జికల్, ఎంపీఈవో అయ్యన్న గ్రామ సర్పంచ్ నారాయణ, పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 04, అక్టోబరు 2025

పోరుబాటలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు

విశాలాంధ్ర - నందికొట్కూరు: వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పోరుబాటకు రెడీ సిద్ధమవుతున్నామని నందికొట్కూరు అర్బన్ గ్రామ సచివాలయం వార్డు అధ్యక్షులు గొల్ల రాంబాబు అన్నారు. శుక్రవారం నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నూతన గ్రామ వార్డు సచివాలయం కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా గొల్ల రాంబాబు మాట్లాడుతూ మన రాష్ట్రంలో ఏడాదిగా సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతున్నాయంటే అందుకు కారణం వార్డు-గ్రామ సచివాలయ ఉద్యోగులు అని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు జేఏసీగా ఏర్పడడం జరిగిందని అందులో భాగంగా ప్రభుత్వంపై పోరుబాటకు అంచెలంచెలుగా కార్యాచరణను మొదలు పెడుతున్నామన్నారు. ప్రస్తుతం గ్రామ-వార్డు సచివాలయం కేంద్రంగా సుమారు 13 శాఖలకు సంబంధించిన పని చేస్తున్నామని, అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన నుంచి ఇప్పటివరకు పైస్థాయి అధికారులు మెల్ల మెల్లగా ఆ ఉద్యోగులపై పని భారం పెంచే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం మాతృ శాఖ పనులు కాకుండా డోర్ టూ డోర్ సర్వేలు చేయిస్తున్నారని, సర్వేల పేరుతో ప్రతీ ఇంటికి వారానికి రెండుమూడు సార్లు వెళ్తున్నట్లు తెలిపారు. పింఛన్ల పంపిణీ వ్యవహారం కత్తి మీద సాముగా మారిందని ఏది ఏమైనా మా పని మాకు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ సుల్తాన్ బాషా, ట్రెజరీ సుధాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మద్దిలేటి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఆర్.రెహమాన్, మరి కొంతమందిని నియమించారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా తొమ్మిది మందిని ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.

విజయవాడలో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: ఈ నెల 7న విజయవాడ నగరంలో జరుగు మహా ఫ్యాప్టో ధర్నాను జయప్రదం చేయాలని ఎస్టియు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ నాయుడు, రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్ పిలుపు నిచ్చారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ముందు ఏర్పా టు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు ఉపాధ్యాయులను బోధనేతర కార్య క్రమాల నుండి తప్పించడం, అధికారంలోకి వచ్చిన వెంటనే మెరుగైన పిఆర్సీ, 30శాతం, మధ్యంతర భృతి మంజూరు, సిపిఎస్ స్థానంలో మెరుగైన పెన్షన్ విధానం, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెన్షనర్లకు కార్పొరేషన్ ఏర్పాటు వంటి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి 16 నెలలు పూర్తయినా ఏ ఒక్క హామీ పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. ఉద్యోగులకు స్నేహ పూరిత ప్రభుత్వం అని చెబుతూనే రాష్ట్రంలోని 12 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన ఏ ఒక్క సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించిన పరిస్థితి కానీ, చర్చించిన పరిస్థితి కానీ లేద న్నారు. ప్రభుత్వ పథకాలను, నిర్ణ యాలను విజయవంతంగా అమలు చేస్తున్న ఉద్యోగులకు సంబంధించిన సమస్యల పరిష్కారం, సంక్షేమం మాత్రం ప్రభుత్వం మరిచిపోయిందని విమర్శించారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు చెల్లించవలసిన దాదాపు రూ.30 వేల కోట్ల ఆర్థిక బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం రోడ్ మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2003 డిఎస్సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలుకు సంబంధించిన దస్త్రం ఆర్థిక శాఖలో గత 4ఏళ్లుగా మూలుగుతుందన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించవలసిన గ్రాట్యూటీ, కమ్యూటేషన్, ఈఎల్ ఎన్కాష్మెంట్, అంత్యక్రియల ఖర్చులు తదితర పెన్షన్ సౌలభ్యాలను కూడా చెల్లించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతుందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు ప్రతి సంవత్సరము రూ.180 కోట్ల హెల్త్ కార్డుల అమలు కొరకు చెల్లిస్తున్నప్పటికీ హెల్త్ కార్డుపై వైద్యానికి ఏ హాస్పిటల్లో అంగీకరించడం లేదన్నారు. పురపాలక ఉపాధ్యాయులకు జిపిఎఫ్ సౌకర్యము, అర్బన్ ఎంఈఓ పోస్టులను మంజూరు చేయాలని కోరారు. గురుకుల, ఆదర్శ, 1998, 2008 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్ల పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులతో వెట్టి చాకిరీ చేయించయుంటూ కనీస వేతన స్కేల్ కూడా అమలు చేయ డం లేదన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వెంటనే ఎంటీ ఎస్‌ను అమలు చేయాలన్నారు. కారుణ్య నియామకాలలో జాప్యం వలన మరణించిన ఉద్యోగుల వారసులు అనేక ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారన్నారు. అంతర్ జిల్లా బదిలీలలో మిగిలిన స్పౌజ్ క్యాటగిరి కింద దరఖాస్తు చేసుకున్న వారం దరికి బదిలీ అవకాశం కల్పించాలని కోరారు. ఏకీకృత సర్వీస్ రూల్స్, జేఎల్ పదోన్నతుల సమస్యపై ప్రభుత్వం చిత్తశుద్ధి కనపరచకపోవడంతో మూడు దశాబ్దాలుగా కోర్టుల చుట్టూ తిరగవలసి వస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయ సంఘాలతో విద్యా రంగ, ఆర్థిక సమస్యలపై చర్చించి పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు సమస్యల పరిష్కరకు ఈ నెల 7న విజయవాడలో జరిగే ఫ్యాప్టో ధర్నా కార్యక్రమం నకు పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు కదలి రావాలని ఉపాధ్యా యులకు పిలుపును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు పట్టణ ప్రధాన కార్యదర్శి భీమరాజు సీనియర్ నాయకులు ప్రహ్లాద, ప్రసాద్, రాజా సతీష్, మారయ్య, నిరం జన్ కుమార్, రాముడు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధి

విశాలాంధ్ర - హొళగుంద: అందరి సహకారంతో ఆలూరు నియోజక వర్గ అభివృద్ధి చేపడుతామని రాష్ట్ర టిడిపి ఆర్గనైజింగ్ సెక్రెటరీ వైకుంఠం శివప్రసాద్ అన్నారు. హెబ్బూరు కొట్టాలలో శుక్రవారం ఆయన టిడిపి నాయకులు, కార్యకర్తలను మర్యాదపూర్వకంగా కలుసుకొని చర్చిం చారు. ఈ సందర్భంగా ఆయన టిడిపి నాయకులతో మాట్లాడుతూ అందరి సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయాలని మనలో వర్గ విభేదాలు వద్దే వద్దని అందరూ ఒకే పార్టీ జెండా, అజెండాతో పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలు ఏమున్నా చర్చించుకుని పరిష్కరించుకోవాలని సమస్యలను నా దృష్టికి తీసుకువస్తే ఇన్చార్జి ద్వారా పరిష్కరించడానికి శ్రద్ధ వహిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర టిడిపి స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వైకుంఠం శివప్రసాద్ వెంట మండల టిడిపి కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య, వీరన్న గౌడ్, టిబిపిడిసి చైర్మన్ మిక్కిలినేని శివప్రసాద్, టిడిపి సీనియర్ నాయకులు ఈ గోవింద గౌడ్, రాజా పంపన గౌడ, ఎర్రిస్వామి, బాబి, చిన్న ఆట శేషగిరి, విష్ణువర్ధన్ రెడ్డి, అబ్దుల్ సుభాన్, వలి, గిరి, వేణు, శీను, కిరణ్, మురళి, దుర్గప్ప, టిడిపి కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన దుండగులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర -గోనెగండ్ల: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి దుండగులను గుర్తించి వెంటనే అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కరుణాకర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గంగాధర చిత్తూరు నియోజకవర్గం వెదురు కుప్పం మండలం బొమ్మయ్యపల్లి పంచాయతీ దేవళంపేటలో జరిగిన ఘటన బాధాకరం అని అన్నారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను గుర్తించి పార్టీలకు అతీతంగా అందరిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేవళంపేట గ్రామంలో రాత్రి సమయంలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలపై దాడులు చేస్తూ సమాజాన్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్న వారిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. లేనియెడల ప్రజా సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు.

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: మహాత్మా గాంధీ 156వ జయంతి సందర్భంగా నంద్యాల గాంధీచౌక్ నందు మహాత్మా గాంధీ విగ్రహానికి రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, ఎమ్మెల్సి ఇషాక్ బాష, జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 2న గాంధీ జయంతిని జరుపుకుంటామని, జాతిపిత అయిన మోహన్ దాస్ కరంచంద్ గాంధీ జన్మదినమన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ అహింస, సత్యాగ్రహం వంటి సూత్రాలను అనుసరించి కీలక పాత్ర పోషించారని. ఐక్యరాజ్యసమితి ఈ రోజును అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా ప్రకటించిందన్నారు. దేశవ్యాప్తంగా ప్రార్థనా సమావేశాలు, నివాళులు, గాంధీ ఆశయాలను గుర్తుచేసే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. వేంకటేశ్వరస్వామి కల్యాణం

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని మూదురాళ్లపల్లె గ్రామంలో వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు వేద పండితులు అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రవణా నక్షత్రం సందర్భంగా కల్యాణోత్సవం అత్యంత కమనీయంగా జరిగింది. ఉభయదారులు మల్లెల ఇంద్రాదేవి, నరేంద్ర సాగర్ దంపతులచే శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామికి కల్యాణం చేశారు. తాళిబొట్టు కట్టించి తలంబ్రాలు పోయించారు. అనంతరం వెంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులచే పల్లకి ఉత్సవం చేశారు. భక్తులకు అన్న దానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పులి ఓబులరెడ్డి, సుదర్శన్‌రెడ్డి మహేశ్వరరెడ్డి, చంద్ర ఓబులరెడ్డి, సాయికిరణ్, సాయికుమార్, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు

విశాలాంధ్ర - పాములపాడు : బీజేపీ మండల అధ్యక్షులు రాయపాటి మురళీ మోహన్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రమైన పాములపాడులో గాంధీ 156వ జయంతి, భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి 121వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సముపార్జనలో ముందుండి భరత జాతిని ఏకతాటిపై నడిపించి బ్రిటీష్ సామ్రాజ్యంపై శాంతి,అహింసలతో పోరాడి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయులు గాంధీజీ అని అన్నారు. మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జై జవాన్ జై కిసాన్ నినాదంతో దేశంలో కొత్త ఉత్సాహం నింపారు.నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం తన జీవితమంతా నిజాయితీగా బతికిన శాస్త్రి చనిపోయేవరకు సొంత ఇల్లు లేకుండా జీవించిన నిరాడంబరుడనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి

వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గింపు హర్షనీయం

విశాలాంధ్ర - రుద్రవరం: రాష్ట్రంలోని వ్యవసాయ రైతుల ఉపకరణాల సామాగ్రిపై ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం ఎంతో హర్షించదగ్గ విషయమని మండల వ్యవసాయ అధికారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం నుండి అమ్మవారి శాల నాలుగు రోడ్ల కూడలి వరకు ప్రభుత్వం రైతుల వ్యవసాయ పరికరాల జీఎస్టీ తగ్గింపుపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ వ్యవసాయ సామాగ్రి లైన ట్రాక్టర్లు, ఆయిల్ ఇంజన్లు, టైర్లు, డ్రిప్పు ఇరిగేషన్, చేతిపంపులు, పలు రకాల పరికరాలపై గత ప్రభుత్వంలో ఉన్న జీఎస్టి రేట్లను నేటి ప్రభుత్వం రైతుల అభివృద్ధిని ఆకాంక్షిస్తూ తగ్గించడం ఎంతో హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, అగ్రికల్చర్ అధికారి దస్తగిరి, పీఆర్ఏ ఈ కమల్ సాహెబ్, కూటమి ప్రభుత్వ మండల కన్వీనర్లు రంగనాయకులు, డి.కొట్టాల కృష్ణారెడ్డి, శేఖర్, లక్ష్మీరెడ్డి, పలువురు వ్యవసాయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

వసంతోత్సవంతో ముగిసిన దేవి శరన్నవరాత్రులు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణంలోని విశ్వరూప నగర్ కాళికామాత ఆలయంలో దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు ఆలయ కమిటీ అధ్యక్షులు దురుగడ్డ రవీంద్రాచారి ఆధ్వర్యంలో వసంతోత్సవా లతో వైభవంగా ముగిశాయి. ముందుగా అమ్మవారిని ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ ఆచార్యులు లోకేష్ ఆచారి ప్రత్యేకంగా అలంకరించి సాంప్రదాయం బద్ధంగా వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం పట్టణ పురవీధుల గుండా అమ్మవారి వసంతోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం మహా నివేదన అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. శ్రీవాణి రామకృష్ణ శిల్పకళా మందిరం నిర్వాహకులు దురుగడ్డ బాలసుబ్రమణ్యం ఆచారి సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం అమ్మవారి చీరలు వేలం నిర్వహించారు. కాగా గురువారం అమ్మవారు విజయ లక్ష్మి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం మేళ తాళాల మధ్య అంగరంగ వైభవంగా శమీ దర్శనం నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు మరియు మహిళా కమిటీ ఆధ్వర్యంలో కౌమార పూజ నిర్వహించారు. రాత్రి చిన్నారుల నవదుర్గల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల మధ్య అమ్మవారి గ్రామోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. గ్రామోత్సవంలో మైదుకూరు నరేష్ కోలాట బృందం వారి కోలాటం ప్రజలను ఆకట్టుకుంది.

స్మార్ట్ కార్డుల పంపిణీ అస్తవ్యస్తం

విశాలాంధ్ర - వెలుగోడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను ఎంతో మేలు చేయాలనే ఉద్దేశతో స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరు చేసింది. కానీ అధికారులు ఈ స్మార్ట్ కార్డులను ప్రజలకు పంపిణీ చేయాల్సింది పోయి సచివాలయంలో కుప్పలు కుప్పలు వేసి తీసుకెళ్ళండి అంటే ప్రజలు ఒకరి కార్డుకి బదులు మరొకరు తీసుకెళ్లితే, ఎవరిదైనా కార్డు మిస్ అయితే, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా మిస్ యూస్ చేస్తే, దీనికి ఎవరు బాధ్యులు అని ప్రజలు ప్రశ్నించారు. అధికారులు ఏ విధంగా పంపిణీ చేయాలనే నిర్దేశాలు ఉన్నాయో అలానే పంపిణీ చేస్తే బాగుంటుందని ప్రజలు కోరుచున్నారు. నిర్లక్ష్యం చేస్తున్న సిబ్బంది పై చర్య తీసుకోవాలని ప్రజలు కోరారు. స్పందించిన తహసీల్దార్ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీలో సమస్య తహసిల్దార్ శ్రీనివాస గౌడ్ తమ దృష్టికి వచ్చిన వెంటనే ఉప తహసీల్దార్ చంద్రశేఖర్ తో కలిసి సాయంత్రం సచివాలయం దగ్గరకు చేరుకొని మూసి ఉన్న సచివాలయాన్ని తెరిపించి, స్మార్ట్ కార్డులు పంపిణీ రికార్డులను పరిశీలించి, ప్రభుత్వం యొక్క సూచనల మేరకు స్మార్ట్ కార్డుల పంపిణీ చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ విధంగా పంపిణీ చేయకూడదని సంబంధిత సిబ్బందికి మెమో జారీ చేయడం జరిగింది. ఇలాంటి సమస్యలు మండలంలో ఎక్కడ జరగకుండా నిత్యం దీని మీద పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు.

రేషన్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యం

విశాలాంధ్ర - జూపాడు బంగ్లా: రాష్ట్రంలో రేషన్ పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను తీసుకొచ్చిందని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని తుడిచెర్ల గ్రామంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తుందని ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో రేషన్ కార్డుల విషయంలో అనేక సమస్యలు ఎదురైనా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పుడు సాంకేతిక పద్ధతులను ఉపయోగించి స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తూ పారదర్శకంగా అర్హులైన వారికి ప్రయోజనాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన అన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రభుత్వం అందించే పలుసంక్షేమ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ప్రవీణ్ కుమార్, టిడిపి నాయకులు సురేష్ యాదవ్, వేణుగోపాల్ యాదవ్, వాడాల నీటి సంఘం చైర్మన్ కాగుల శంకర్ యాదవ్, పుల్లన్న యాదవ్, తుడిచెర్ల దేవస్థానం కమిటీ చైర్మన్ సంపత్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవి మాత అమ్మవారి వసంతోత్సవం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈ ఏడాది దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. శరన్నవరాత్రుల అనంతరం ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు దేవిశెట్టి హరీష్ బాబు ఆధ్వర్యంలో వసంతోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి పల్లకిపై కూర్చోబెట్టి గ్రామోత్సవం నిర్వహించారు. సంఘ సభ్యులు, ప్రజలు ఆనందోత్సవాల మధ్య వసంతోత్సవం జరుపుకున్నారు. కాగా గురువారం విజయదశమి పర్వదినం సందర్భంగా అమ్మవారి జమ్మి చెట్టు ఉత్సవం అత్యంత ఘనంగా జరిగింది. అమ్మవారి విగ్రహాన్ని స్థానిక కొప్పరపు మిల్లు ఆవరణలోని జమ్మి చెట్టు వద్దకు తీసుకుని వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి వాసవి మాత అమ్మవారిని విజయలక్ష్మి అలంకారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని డిఎస్‌పి ప్రమోదు, పట్టణ సీఐ యుగంధర్, ఎస్సై నగీన తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం వైభవంగా జరిగింది. విజయలక్ష్మి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసి అనంతరం ట్రాక్టర్ పై కూర్చోబెట్టి పట్టణ వీధులలో ఊరేగింపు ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మంత్రాలయం ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి, వైసీపీ కార్యనిర్వాహక మండల సభ్యులు సీతారామిరెడ్డిని శుక్రవారం రాంపురం గ్రామంలో పెద్ద కడబూరు మండల వైసీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, బూత్ కమిటీ తాలూకా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘురామ్, వైసీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి శివరామరెడ్డి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి ఈరన్న, వైసీపీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి, గ్రామ సర్పంచులు రామాంజనేయులు, చంద్రశేఖర్ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసీపీ కార్యనిర్వాహక మండల సభ్యులు సీతారామిరెడ్డి, పురుషోత్తం రెడ్డిలను శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2029లో వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవడానికి సైనికుల్లా పని చేయాలని హితవు పలికారు. పెద్దకడబూరు మండలంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి పూర్వ వైభవం తేవాలని కోరారు. మాజీ వీఆర్వో రామలింగారెడ్డి, వైసీపీ నాయకులు జాము మూకయ్య, గజేంద్రరెడ్డి, విజయేంద్రరెడ్డి, జాము వీరేష్, బ్రహ్మయ్య ఆచారి తదితరులు పాల్గొన్నారు.

కాశ్మీర్ ఎగ్జిబిషన్ ప్రారంభం

విశాలాంధ్ర - కర్నూలు: నగరంలోని ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన కాశ్మీర్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్‌తో పాటు కర్నూల్ పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఇల్లూరు లక్ష్మయ్య, మైనార్టీ నాయకులు నౌషాద్, కార్పొరేటర్ పరమేష్, ఎగ్జిబిషన్ నిర్వాహకులు కస్తూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాశ్మీర్ ఎగ్జిబిషన్‌ను రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ఎంపీ బస్తిపాటి నాగరాజుతో కలిసి పరిశీలించారు. ఎగ్జిబిషన్ ప్రత్యేకతలను నిర్వాహకులు వారికి వివరించారు. అనంతరం రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ కర్నూల్ నగరంలో అందరినీ ఆకట్టుకునేలా కాశ్మీర్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించే ప్రజలు కాశ్మీర్‌లో ఉన్న అందాలను ఆస్వాదించవచ్చని తెలిపారు. ఇక్కడ సెల్ఫీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. ఇది కర్నూలు కొత్తదనాన్ని తీసుకువస్తుందన్నారు. రాష్ట్ర మంత్రి టీజీ భరత్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ కర్నూలు నగరంలో ప్రజలను ఆకట్టుకునేలా కాశ్మీర్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను ప్రతి ఒక్కరు సందర్శించి ఆహ్లాదాన్ని పొందాలని కోరారు.

ఘనంగా అమ్మవారి వసంతోత్సవం

విశాలాంధ్ర-అవుకు: పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం అమ్మవారి పవళింపు సేవ కార్యక్రమంతో ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉదయము అమ్మవారి వసంతోత్సవం సందర్భంగా అమ్మవారి ఉత్సవ మూర్తిని అందంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఉంచి బ్రహ్మోత్సవాన్ని నిర్వహించారు. ఆర్య వైశ్యులు రంగులు చదువుకుంటూ నృత్యాలు చేస్తూ పట్టణ పురవీధుల గుండా వసంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంకాలం గూడూరు సుబ్బ నరసయ్య, గూడూరు నాగప్రసాద్ పూజ ఉభయదారులుగా అమ్మ వారికి పవళింపు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరము భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మేడం ఆంజనేయులు, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు తాలేపల్లి నాగేంద్ర, ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు జూటూరు రాజ్యలక్ష్మి, తల్లం సుబ్బ నాగభూషణం, మల్లెల సూర్యనారాయణ, మల్లెల ఆంజనేయులు, బొగ్గరపు రామాంజనేయులు గూడూరు సుదర్శన్ బొగ్గరపు పద్మనాభం, మల్లెల సునీల్ కుమార్, జీవి సుబ్రహ్మణ్యం, మేడం సతీష్, మేడ రవిశంకర్, మారం రమణ, మల్లెల బాబి,తాలేపల్లి రాజేష్, పెండేకంటి సంతోష్ కుమార్, రావూరి రామయ్య, తల్లం సురేంద్ర, సన్నిధి శివ, రావూరి ప్రసాద్, సన్నిధి శ్రీనివాసులు, మల్లెల సతీష్ బాబు, తాలేపల్లి జనార్దన్, వంకధార సతీష్ ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన

విశాలాంధ్ర - గోనెగండ్ల: మండల పరిధిలోని హెచ్.కైరవాడి గ్రామంలో వస్తు సేవా పన్ను మీద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా వ్యవసాయఅధికారి వరలక్ష్మి, ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత, జీఎస్టీ అధికారి వెంకటరమణ, ఈవోపీఆర్డి, అనంతసేనాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ప్రస్తుతం అమలు చేస్తున్న జీఎస్టీ వల్ల రైతులకువచ్చే, పరికరాలు, ట్రాక్టర్స్, ట్రాక్టర్ సామాన్లు, డ్రిప్ స్ప్రింక్లర్స్ మీద ఐదు శాతం మాత్రమే ట్యాక్స్ వసూలు చేయడం జరుగుతుంన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు తిమ్మారెడ్డి, గురునాథ్ రెడ్డి, రాజేష్, మాజీ పాలక వర్గ సభ్యులు ఎస్.మాబాష, వ్యవసాయ విస్తరణ అధికారి పులిరాజు, రైతులు పాల్గొన్నారు.

పకృతి సంపద పెంచే వన్య ప్రాణులు కాపాడాలి

విశాలాంధ్ర - వెలుగోడు : టైగర్ ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్ వారి ఆదేశాల మేరకు వెలుగోడు రేంజి నందు వన్యప్రాణి వారోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక లిటిల్ ఏంజెల్స్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అడవులు వన్యప్రాణి ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు తెలిపారు.

జీఎస్టీపై రైతులకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు రూరల్: మండలంలోని కోటేకల్ -2, గుడికల్ గ్రామంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి శివ శంకర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో అమలవుతున్న వ్యవసాయ యంత్ర పరికరాలు వాటిపైజీఎస్టీ తగ్గుదల గురించి రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ ఇంచార్జి నాగరాజు దేవరాజు, గ్రామ రైతులు ఏఈవోలు వినోద్, నరసింహుడు, వీఏఏలు హిమబిందు, నరసప్ప పాల్గొన్నారు.